క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పారామెడికల్ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఎంఎల్‌టీ, టీఈసీజీ కోర్సులలో చేరేందుకు ఇంటర్మీడియట్‌లో బైపీసీ, ఎంపీసీ, ఇతర కోర్సులలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత గల విద్యార్థులు ఈ నెల 28లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం దరఖాస్తులను మెడికల్ కళాశాలలో అందించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండల పరిధి జంగేడు సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో భూపాలపల్లి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్‌ను సరఫరాను మళ్లించడం జరుగుతుందని ఏఈ విశ్వాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో చేంజ్ ఓవర్ చేసే సమయంలో మధ్య మధ్యలో మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. ఒకటే సబ్ స్టేషన్ పైలోడ్ ఉండటం వలన వినియోగదారులు ఒక్క రోజు విద్యుత్ వినియోగం తక్కువగా చేసుకోవాలన్నారు. అలాగే రైతులు కూడా రేపు(శనివారం) మధ్యాహ్నం వరకు వ్యవసాయ బోర్లు తక్కువగా వినియోగించుకోవాలని కోరారు.

టై, బెల్టుల పంపిణీ



చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు టై బ్యాడ్జీ, బెల్టులు ఎంఈఓ కోడేపాక రఘుపతి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చక్కగా చదువుకోవాలని కోరారు. దాతల సహాయంతో టై బ్యాడ్జీలు, బెల్టులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, రాజమౌళి, బుర్ర సదయ్య, సాంబమూర్తి, శ్రీనివాస్, రామనారాయణ, నీలిమారెడ్డి, ఉస్మాన్‌అలీ, కల్పన, సరళ, విజయలక్ష్మీ, సుజాత, బుజ్జమ్మ, దాతలు పోగళ్ల మహేందర్ రెడ్డి, దేవ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రేగొండ: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. గురువారం మండలంలోని రూపిరెడ్డిపల్లి వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఐదుగురు ట్రాక్టర్ యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మూడు ట్రాక్టర్లు..

కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు కొత్తపల్లిగోరి ఎస్సై దివ్య తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేసి అక్రమంగా ఇసుకను తరలించడానికి ప్రయత్నించిన ముగ్గురు ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్వతంత్రంగా పోటీచేయాలి

వెంకటాపురం(కె): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదివాసీ యువత స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలబడాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో జెడ్పీటీసీ స్థానాన్ని గిరిజనేతరులకు ఎలా కేటాయిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ చట్టాలకు విరుద్ధంగా ఏజెన్సీలో గిరిజనేతరులకు జెడ్పీటీసీ స్థానాలు కేటాయిండంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎనికల్లో ఆదివాసీ చట్టాలను ఉల్లగిస్తున్న పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కమిటీ ఎన్నిక

మంగపేట: మండలంలోని చెరుపల్లి(కొత్తపేట)లో గౌడ సంఘం గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని శ్రీకోదండరామాలయం ఆవరణలో గ్రామంలోని గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆ సంఘం గ్రామ కమిటి అధ్యక్షుడిగా బొంబోతుల సత్యం, ఉపాధ్యక్షుడిగా గాజుల పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గంట చిట్టిబాబు, కార్యదర్శిగా బత్తిని నాగేష్, కోశాధికారులుగా రామగాని నరేందర్, లగ్గ త్రివిక్రమ్‌ను ఎన్నుకున్నారు.

పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

ఏటూరునాగారం: బస్ చార్జీలను పెంచిన నేపథ్యంలో నిరసన తెలిపేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు మండల నాయకుడు తాడూరి రఘు తెలిపారు. గురువారం మండలంలోని తమ నివాసంలో ఉండగా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సు చార్జీలు ఇష్టానుసారంగా పెంచి ప్రజలను దోచుకుంటున్నారని రఘు ఆరోపించారు. అక్రమ అరెస్టులకు బయపడేది లేదని అన్నారు. కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, ఈసం రామ్మూర్తి, చంద్రబాబు, పోశయ్య, బోజారావు ఉన్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట

ఇందిరమ్మ ఇళ్లకు మాత్రమే ఇసుక సరఫరా

- ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చలివాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

టేకుమట్ల: కొంతకాలంగా మండల కేంద్రంలోని చలివాగు, రాఘవరెడ్డిపేట శివారు, బోర్నపల్లి, కలికోట మానేరులో ఇసుక రవాణా జోరుగా సాగింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు ఉచిత ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వగా ట్రాక్టర్ యజమానులు ఇదే అదునుగా భావించి పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారు. ఇసుక రవాణా నిలిపేయాలని అధికార, ప్రతిపక్షాల పార్టీ నాయకులు మండల కేంద్రంలో ధర్నాలు సైతం చేపట్టారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడంతో ఇసుక రవాణా పర్మిట్లను రెవెన్యూ అధికారుల నుంచి పంచాయతీ కార్యదర్శులకు బదిలీ చేశారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శి పంపిణీ చేసే ఇసుక పర్మిట్ల సహాయంతో లబ్ధిదారులకు ఇసుక చేరుతోంది. దాంతో అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసినట్లు అయింది.

తగ్గిన ఇసుక రవాణా..

ఇంతకు ముందు మండల కేంద్రంలోని చలివాగు, బోర్నపల్లి, కలికోట మానేరు వాగు నుంచి నిత్యం వందలాది ఇసుక ట్రాక్టర్లు తరలిపోయాయి. ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టి సారించి అడ్డుకట్ట వేయడంతో ఇందిరమ్మ లబ్ధిదారులకు మాత్రమే ఇసుకను సరఫరా చేస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు అక్రమ ఇసుక రవాణా తగ్గినట్లేనని మండల ప్రజలు భావిస్తున్నారు. గతంలో మండల కేంద్రం నుంచి నిరంతరం ఇసుక ట్రాక్టర్లు వందలాదిగా నడవడంతో టేకుమట్ల పరకాల ప్రధాన రోడ్డు ఇసుక ట్రాక్టర్లతో నిత్యం రద్దీగా ఉండేది. కానీ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించడంతో అక్రమ ఇసుక రవాణా నిలిచిపోయి ప్రధాన రోడ్డు ప్రశాంతంగా మారిందని పలువురు తెలుపుతున్నారు. అక్రమ రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపడంతో ట్రాక్టర్ డ్రైవర్లు ఇసుక అక్రమ తరలింపునకు భయపడుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేసి, కేసులు నమోదు చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

నిరంతరం నిఘా ఉంచాలి



మానేరు పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాపై అధికారులు పాలకులు నిరంతరం నిఘా ఉంచాలి. గృహ నిర్మాణ అవసరాలకు మాత్రమే అనుమతులు ఇవ్వాలి. లేదంటే భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉంది.

- కొలుగూరి రమేష్, టేకుమట్ల

కేసులు నమోదు చేస్తాం..



చలివాగు, మానేరు పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవు. తప్పని సరిగా అనుమతులు తీసుకుని ఇసుకను తీసుకెళ్లాలి. నిబంధనలకు విరుద్ధంగా ప్రవరిస్తే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు, ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లపై కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే కొన్ని అనుమతులు లేని ట్రాక్టర్లను సీజ్ చేసి, కేసులు నమోదు చేశాం.

- దాసరి సుధాకర్ ఎస్సై, టేకుమట్ల

జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నం సరికాదు

- అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య



నిరసన తెలుపుతున్న నాయకులు

చిట్యాల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం సరికాదని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలు ఏకమై అంబేడ్కర్ చూపిన మార్గంలో కులరక్కసిని అంతమొందించుటకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ ఉండడం ఇష్టం లేక దాడికి యత్నించారని చేశారని అన్నారు. అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని, ఆశయాలను అర్థం చేసుకుని నడుస్తూ ఆయన తీర్పులు ఆలోచించి ఇస్తున్న క్రమంలో దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు దాసారపు నరేష్, గడ్డం సదానందం, బంజర్ల రవీందర్, నేరేళ్ల రమేశ్ చేరాలు, గిన్నారపు కుమార్ పాల్గొన్నారు.

అడవిలో ఉచ్చులు పెడితే చర్యలు



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

- మహదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు

కాళేశ్వరం: అడవిలో జంతువుల కోసం వేటగాళ్లు ఉచ్చులు పెడితే జైలు శిక్ష తప్పదని మహదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లుహెచ్చరించారు. మండల పరిధిలో పలు గ్రామాలకు చెందిన కొంతమంది అడవి జంతువుల కోసం ఉచ్చులు బిగిస్తున్న విషయం తెలియడంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు పవన్‌కుమార్, సాయి శశాంక్ ఆయా గ్రామాలకు చెందిన అనుమానాస్పదంగా తిరుగుతున్న 25 మందిని గురువారం మహదేవపూర్ పోలీసుస్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అడవి జంతువులకు ఉచ్చులు పెట్టడం నేరమని, మనుషులు కూడా గాయపడడం, మృతి చెందే ఆస్కారం ఉందన్నారు. ఎవరైనా అడవిలో ఉచ్చులు పెట్టినా, సహకరించినా చర్యలు తప్పవని అన్నారు. అనంతరం తహసీల్దార్ రామారావు ఎదుట వారిని హాజరు పరిచి బైండోవర్ చేశారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

- డీఎస్పీ సంపత్‌రావు

చిట్యాల: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని డీఎస్పీ సంపత్‌రావు గురువారం సందర్శించారు. ఎన్నికల నిబంధనలను పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయశ్రీ, మండల ప్రత్యేక అధికారి వాల్యా నాయక్, ఎస్సై శ్రావన్‌కుమార్, ఎంఈఓ రఘుపతి, ఎంపీఓ సురేష్, సిబ్బంది కృష్ణ పాల్గొన్నారు.

బురదమయంగా రోడ్డు



బురదమయంగా ఉన్న రోడ్డు

మల్హర్: మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే మట్టి రోడ్డు బురదమయంగా మారింది. దీంతో విద్యార్థులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన సమయంలో ఈ మట్టి రోడ్డు పూర్తిగా బురదగా మారుతుందని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాహసానికి మారుపేరు చే గువేరా

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్



చే గువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కాటారం: ప్రపంచ విప్లవకారుడు, డాక్టర్, రచయిత చే గువేరా సాహసానికి మారుపేరుగా నిలిచాడని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో గురువారం చే గువేరా వర్ధంతిని నిర్వహించారు. చే గువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దామెర కిరణ్ మాట్లాడుతూ.. చే గువేరా నేటి తరానికి స్ఫూర్తి అని కొందరి దుండగుల చేతిలో ఆయన హత్యగావించబడ్డారని పేర్కొన్నారు. పెట్టుబడిదారి, వర్గదోపిడి నుంచి ప్రజలను విముక్తి చేయాలని ఆయన పరితపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్, కార్యదర్శి కుమ్మరి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డు ఏది?



కింద పడిన సూచిక బోర్డు

చిట్యాల: మండల కేంద్రంలోని బియ్యం గోదాం వద్ద ఆర్అండ్‌బీ అధికారులు గతంలో ఏర్పాటు చేసిన చిట్యాల గ్రామ సూచిక బోర్డు కింద పడి నెలల గడుస్తున్న కనీసం దానిని పట్టించుకున్న వారే కరువయ్యారు. సూచిన బోర్డును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కిందపడింది. అధికారుల కనీసం దానిని పట్టించుకోవడం లేదు. సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు బోర్డును సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వాజేడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేరూరు వైద్యులు రాహిల్, యోషిత అన్నారు. మండల పరిధిలోని ఆర్లగూడెం సీతానగరం, చింతూరు లక్ష్మీపురం గ్రామాల్లో గురువారం వెద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగుల పరీక్షించి మందులను ఇచ్చారు. గర్భిణులను పరీక్షించి మందులను ఇవ్వడం తోపాటు పలు ఆరోగ్య సూత్రాలను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలానుగుణంగా కొన్ని వ్యాధులు వస్తాయని అవి రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వారి వెంట హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

రేగొండ: మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన అన్నారపు రమ (55) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతుంది. బుధవారం నొప్పి ఎక్కువ కావడంతో తట్టుకోలేక గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంటల రక్షణకు తప్పని తిప్పలు

- కోతులతో రైతుల ఇబ్బందులు



కోతులను తరుముతున్న రైతు

మల్హర్: అటవీ ప్రాంతాల్లో ఉండాల్సిన కోతుల గ్రామాల్లో ప్రజలపైనే కాకుండా పంట పొలాలపై దాడులు చేస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరి పంట పొట్ట దశలో వచ్చే ధాన్యం తినేందుకు కోతుల గుంపులు దాడులు చేస్తున్నాయి. దీంతో పంట పొలాలు మొత్తం ధ్వంసమవుతోన్నాయి. కోతలను తరిమేందుకు రైతులు ప్రత్యేక సాధనలు వినియోగించినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. గతంలో అడవి పందుల నుంచి పిట్టల నుంచి పంట కాపాడుకునే రైతన్నలు ప్రస్తుతం కోతుల నుంచి కాపాడుకునే పరిస్థితి నెలకొంది. తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు కోతుల బారి నుంచి పంటలను కాపాడుకోవాడని ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

ములుగు రూరల్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు రమేష్ అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ టీఎస్ దివాకర.. జిల్లా ఎన్నికల పరిశీలకుడు రమేష్, వ్యయ పరిశీలకుడు వీరారెడ్డిలతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. జిల్లాలో జరుగుతున్న ఎన్నికల స్థానాలు, ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు మండల ప్రత్యేక అధికారి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంజీవరావు ఆధ్వర్యంలో నామినేషన్ కేంద్రాలను గురువారం ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు మండ పరిషత్ కార్యాలయం నుంచి నామినేషన్ పత్రాలను తీసుకెళ్లారు. వెంకటాపురం మండలం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో పోలీసులు నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

ఏటూరునాగారం: నామినేషన్‌ల ప్రక్రియ పగడ్బందీగా ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ, ఎంపీటీసీ రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను ఆయన తనిఖీ చేసి అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఓ రాంపతి, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లను స్వీకరించేందుకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ప్రమాదకరంగా లోలెవల్ కల్వర్టు



లోలెవల్ కల్వర్టులో పారుతున్న నీరు

టేకుమట్ల: మండలంలోని సుబ్బక్కపల్లి–నవాబుపేట ప్రధాన రోడ్డులోని లోలెవల్ కల్వర్టులో నిత్యం నీటి ప్రవాహం వల్ల పాకురు ఏర్పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. చిట్యాల మండలంలోని నవాబుపేట పెద్ద చెరువు అలుగు నీటితో పాటు, పొలాల్లోని ఉబ్బునీరు కాల్వ ద్వారా వచ్చి లోలెవల్ కల్వర్టు ద్వారా చలివాగులో కలుస్తాయి. దీంతో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పాకురు పెరిగి వాహనదారులు జారీ పడుతున్నారు. సుబ్బక్కపల్లి మీదుగా మొగుళ్లపల్లి, పరకాలకు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి హైలెవల్ కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వెంకటాపురం(కె): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాని షీటీమ్ సభ్యుడు, హెడ్‌కానిస్టేబుల్ సములాల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శివాయం గుడి ఆవరణలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు జరిగితే 1930 నంబర్‌కు కాల్ చేస్తే డబ్బులు తిరిగి పొందే అవకాశం ఉంటుందని వివరించారు. డిజిటల్ అరెస్టు అనేది లేదని.. అలాంటి ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దని సూచించారు. మైనర్లకు పెళ్లి చేస్తే 100 కు కాల్ చేసి తెలపాలని అన్నారు. మహిళలపై ఈవ్‌టీజింగ్ జరిగితే 181 కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు బాలకృష్ణ, మేరాజ్, స్వాతి తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ హెల్పర్ మృతి



అనసూర్య (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి: అంగన్‌వాడీ హెల్పర్ చర్పా అనసూర్య(48) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. కామారం అంగన్‌వాడీ కేంద్రంలో అనసూర్య హెల్పర్‌గా పని చేస్తుంది. ఈక్రమంలో అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మూడు రోజుల నుంచి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, ఆదివాసీ సంఘాల నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు అనసూర్య మృతదేహాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించారు.

ఆకాశంలో కొంగల క్యూ!



ఆకాశంలో క్యూలో వెళ్తున్న కొంగలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం సమీపంలోని తెలంగాణ, మహారాష్ట్ర అంతరాష్ట్ర వంతెన అవుతలి వైపున పంట పొలాలపై యుద్ధ విమానాలు క్యూ కట్టి విన్యాసాలు చేస్తున్నట్లుగా కొంగలు తరలివెళ్లడం ఆకట్టుకుంది. గురువారం సాయంత్రం కొంగలు క్యూకట్టి ఆకాశంలో వెళ్తు యుద్ధ విమానాలు తరలిపోతున్నట్లు కనిపించింది. దీంతో అటుగా వెళ్తున్న చూపరులను ఆకర్శించాయి.